సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం, 2, ఏప్రిల్, 2023



కాలేజీకి వెళ్లాల్సినవారు ఆస్పత్రికి..

రుద్రంపూర్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ముగ్గురు బైక్‌పై వెళ్తుండగా, కళాశాల ముందే కారు ఢీకొని గాయపడ్డారు. 8లో




కళ్లారా చూడొచ్చు.. ఎదగొచ్చు!

వేసవి సెలవుల్లో ఇస్రోలో 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. 10లో

గరిష్టం / కనిష్టం
36° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొంత ఎండతీవ్రతతోపాటు ఉక్కపోతగా ఉండవచ్చు.



ఇఫ్తార్ (ఆదివారం సా.) 6.28
సహర్ (సోమవారం ఉ.) 4.41

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా బాలాజీ కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ఆలయంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారికి భక్తులు పూజలు చేసి, స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సమష్టి కృషితోనే రాష్ట్రస్థాయి అవార్డు



కలెక్టర్ అనుదీప్‌ను కలిసిన గౌతంపూర్ సర్పంచ్ సుజాత, కార్యదర్శి షర్మిల

చుంచుపల్లి: జాతీయస్థాయి అవార్డుల్లో భాగంగా గౌతంపూర్ గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయిలో ఆరోగ్య పంచాయతీ అవార్డు రావడం వెనక పాలకవర్గం, మండల అధికారుల సమష్టి కృషి ఉందని కలెక్టర్ అనుదీప్ అన్నారు. రాష్ట్రస్థాయి అవార్డును స్వీకరించిన అనంతరం శనివారం సర్పంచ్ సుజాత, కార్యదర్శి షర్మిల, ఎంపీడీఓ రమేశ్, ఎంపీఓ సత్యనారాయణ జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. జిల్లా నుంచి గౌతంపూర్ పంచాయతీ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిందని, ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని చెప్పారు. అవార్డు పొందిన గౌతంపూర్ సర్పంచ్, కార్యదర్శులను డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి అభినందించారు.

ఇల్లెందులో 141 శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా మార్చి నెలలో 141 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు. శనివారం తన కార్యాలయం జరిగిన సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. మార్చిలో 3.08 లక్షల టన్నుల లక్ష్యానికి 4.34 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 45 లక్షల టన్నులకు 108 శాతంతో 48.79 లక్షల టన్నుల బొగ్గు వెలికితీశామని పేర్కొన్నారు. జేకే ఓసీ విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ నెల 26న పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓసీ 1114 హెక్టార్లలో విస్తరించి ఉంటుందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఉత్పత్తి పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో అధికారులు మల్లారపు మల్లయ్య, ఎం. గిరిధర్‌రావు, సాయి స్వరూప్, జీవీ మోహన్‌రావు పాల్గొన్నారు.

మణుగూరులో 47 శాతం..

మణుగూరు రూరల్: మణుగూరు ఏరియాలో మార్చి నెలలో ఉత్పత్తి లక్ష్యం 10.97 లక్షల టన్నులు కాగా, 5.13లక్షల టన్నులతో 47శాతం ఉత్పత్తిని సాధించామని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 116 లక్షల టన్నుల లక్ష్యానికి 118.87 లక్షల టన్నులు వెలికితీసి 102 శాతం నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మార్చిలో ఓబీ వెలికితీత లక్ష్యం 15 లక్షల క్యూబిక్ మీటర్లుకాగా, 17.97లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసినట్లు తెలిపారు. మార్చిలో 10.62 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు డి.లలిత్‌కుమార్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎస్.రమేష్, శ్రీనివాసచారి, వెంకట్రావు, మేరి కుమారి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా ఉద్యోగులే..

ఆదర్శం.. తురుమలగూడెం గ్రామం

- గ్రామంలో 140 బంజారా కుటుంబాలు
- 70 మంది ప్రభుత్వ, 40 మంది ప్రైవేట్ ఉద్యోగులు
- వారి స్ఫూర్తితో శ్రమిస్తున్న మరోతరం





తురుమలగూడెం గ్రామం (ఇన్‌సెట్) గ్రామంలోని పాఠశాల

సండే స్పెషల్

ఆ గ్రామంలో అందరూ బంజారాలే. సమీప గ్రామాల్లో భూస్వాముల వద్ద జీతాలు ఉంటూ, పోడు కొట్టుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. ఎన్నాళ్లీ వెట్టి చేయాలనే భావనతో తమ పిల్లలను ఒక్కొక్కరుగా బడికి పంపడం ప్రారంభించారు. వారు చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో మరికొందరు కొలువులు కొట్టారు. ప్రస్తుతం 70 మంది సర్కారు ఉద్యోగులుగా వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. మరో 40 మంది ప్రైవేటు రంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు. గ్రామంలో తొలుత 10 కుటుంబాలు ఉండగా, ప్రస్తుతం 140 కుటుంబాలు నివాసముంటున్నాయి.

–అశ్వాపురం

పునాది వేసిన హనుమానాయక్..

గ్రామంలో బాణోత్ భద్రూనాయక్, బాణోత్ వాలియానాయక్, గుగులోత్ హనుమనాయక్‌లు గ్రామపెద్దలుగా ఉండేవారు. గుగులోత్ హనుమనాయక్‌కు మరో ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరిమణులు ఉండేవారు. కుటుంబం మొత్తం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో హనుమానాయక్ తన కుమారుడిని, తమ్ముడిని చదివించాలనే ఉద్దేశంతో భద్రాచలంలోని గిరిజన హాస్టల్‌లో చేర్పించాడు. క్రమంగా వారితోపాటు గ్రామంలోని ఇతర పిల్లలను కూడా హాస్టళ్లో చేర్పించేలా ప్రోత్సహించాడు. ఎవరైనా బడి మానేస్తే హనుమానాయక్ వారికాళ్లకు తాడు కట్టి చెట్టుకు తలకిందులుగా వేలాడదీసేవాడని, ఆ భయంతో అందరూ పాఠశాలకు వెళ్లేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పుడు శిక్ష బాధ అనిపించినా, అదే తాము జీవితంలో స్థిరపడేందుకు దోహదపడిందని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

తిండి లేకపోయినా చదువులు కావాలా..?

గ్రామంలో ప్రతి కుటుంబం తమ పిల్లలను హాస్టల్‌లో చేర్పించేది. పేదరికం వెంటాడుతున్నా పిల్లలను మాత్రం బడి మాన్పించేవారు కాదు. తినడానికి తిండి లేకపోయినా పిల్లలకు చదువులు కావాలా? అని కొందరు భూస్వాములు హేళన చేశారని గిరిజనులు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో గ్రామపెద్దలు భద్రాచలంలోని ఐటీడీఏ అధికారులను సంప్రదించి గ్రామస్తులకు రుణాలు మంజూరయ్యేలా కృషి చేశారు. సబ్సిడీపై కరెంటు మోటార్లు, వ్యవసాయ బావులను, గేదెలను ఇవ్వడంతో ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. దీంతో పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. హనుమానాయక్ శ్రమ ఫలించింది. కుమారుడు జయరాం ఇంజనీరింగ్ ఉద్యోగం సాధించగా, సోదరుడు వీరస్వామి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. ఇలా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 70కి చేరింది. వారి స్ఫూర్తితో గ్రామంలోని మరికొందరు ఉద్యోగసాధనలో ముందుకు సాగుతున్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం..



ఊరు కోసం, కుటుంబం కోసం మా నాన్న హనుమనాయక్ పడిన కష్టం దగ్గరనుంచి చూసి చలించిపోయాను. అదే స్ఫూర్తితో చదివి అటవీ శాఖలో ఉద్యోగం సాధించాను. మా ఊరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందటానికి నా వంతుగా సహాయ సహకారాలు అందిస్తాను.

–గుగులోత్ రాంసింగ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్

మా అన్నయ్య ఆశయాలు కొనసాగిస్తాం



గ్రామంలో అందరూ చదువుకోవాలనే మా అన్నయ్య ఆశయాలు కొనసాగిస్తాం. నేను పాఠశాల విద్యను, ఉన్నత విద్యను భద్రాచలం హాస్టల్‌లో కొనసాగించాను. అప్పుడు లంబాడీలు టీఎస్‌టీ ట్రైబ్స్‌గా ఉన్నారు. ఎస్టీ హాస్టళ్లలో ప్రవేశానికి మాకు అవకాశం లేకుండా ఉండేది. మా అన్నయ్య ఐటీడీఏ పీఓ సహాయంతో హాస్టల్‌లో చేర్పించాడు. ఈ రోజు మా గ్రామంలో ప్రతి ఇంటికి ఒకరు ఉద్యోగులుగా స్థిరపడ్డారు.

–గుగులోత్ వీరస్వామి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

నాతోపాటు మరికొందరు..



హనుమానాయక్ స్ఫూర్తి, ప్రోత్సాహంతోనే నేను బడికి వెళ్లాను. మేము తొలిగా చదువుకోవటమే కాక మా కుటుంబసభ్యులను, గ్రామంలోని యువతను చదువు వైపు కొనసాగించేలా ప్రోత్సహించాం. నా ఇద్దరు పిల్లలు డాక్టర్, ఇంజనీర్‌గా స్థిరపడ్డారు.

–ధరావత్ రెడ్డయ్య, డిప్యూటీ మేనేజర్, వైజాగ్ స్టీల్ ప్లాంట్

భూములు అమ్మి చదివిస్తున్నారు..



నాన్నతోపాటు మేనమామలు హనుమానాయక్, వీరస్వామి ప్రోత్సాహంతో చదువుకున్నాను. నా చదువుంతా హాస్టళ్లలోనే సాగింది. డీఎస్సీలో జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించాను. అదే డీఎస్సీలో మా కుటుంబంలో ముగ్గురికి ఒకేసారి ఉద్యోగం వచ్చింది. మా గ్రామంలో చదువే ముఖ్యం. వ్యవసాయ భూములు అమ్మి పిల్లలను చదివించేవారూ ఉన్నారు.

–బాణోత్ వీరన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు

డాక్టర్ కావాలనేది అమ్మ, నాన్న కోరిక..



డాక్టర్ కావాలనేది అమ్మ, నాన్న కోరిక. వారి కోరిక తీర్చడానికి అహర్నిశలు కష్టపడి చదివా. ఎంసెట్‌లో సీటు సాధించి మమత మెడికల్ కళాశాలలో వైద్య విద్య అభ్యసించాను. మా కుటుంబంలో మా బాబాయి కూడా ప్రభుత్వ డాక్టర్‌గా స్థిరపడ్డారు. మా గ్రామానికి నా వంతుగా సహాయం అందిస్తాను.

–డాక్టర్ విజ్ఞాన్‌నాయక్, గ్రామస్తుడు

టైమ్ టు టైమ్..

- బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు నమోదు
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు
- ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల్లో అమలు
- మెరుగుపడనున్న అధికారులు, సిబ్బంది సమయపాలన



డీఆర్డీఏ విభాగంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రం

చుంచుపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు పక్కాగా సమయపాలన పాటించేలా కలెక్టర్ అనుదీప్ చర్యలు తీసుకుంటున్నారు. అన్ని శాఖల జిల్లా కార్యాలయాల్లో ఈ నెల 1 నుంచే బయోమెట్రిక్ విధానం కచ్చితంగా అమలు చేయాలని ఇటీవల ఆదేశించారు. దీంతో అధికారులు బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 2020, మార్చి వరకు పలు ప్రభుత్వ శాఖల్లో హాజరు నమోదుకు బయోమెట్రిక్ పద్ధతి పాటించారు. ఆ తర్వాత కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈ విధానానికి స్వస్తి పలికారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు విధులకు ఇష్టానుసారంగా రావడం, సమయ పాలన పాటించకపోవడం, విధులకు హాజరుకాకున్నా మరుసటి రోజు రిజిస్టర్లలో సంతకాలు పెట్టడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు మళ్లీ అన్ని శాఖల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేసేందుకు పూనుకున్నారు. కొత్త కలెక్టరేట్‌లో సుమారు 42కు పైగా జిల్లా కార్యాలయాలు ఉండగా, ఇప్పటికే డీఆర్డీఏ, డీపీఓ, సీపీఓ, వైద్య, ఆరోగ్యశాఖ తదితర శాఖల్లో 30 శాఖల్లో బయోమెట్రిక్ పద్ధతి అమలు చేస్తున్నారు. 7 యంత్రాల ద్వారా 550 మంది ఉద్యోగుల హాజరు నమోదు చేస్తున్నారు. మిగిలిన శాఖల్లో బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ వంటి ఐదారు శాఖలు వాటి సొంత భవనాల్లో కొసాగుతుండగా, సుమారు 250 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక వీరు కూడా బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు నమోదు చేసుకోవాలి. దీంతో ఉద్యోగుల హాజరుశాతం క్రమంగా పెరగడంతోపాటు సమయపాలన పాటించే అవకాశం ఉంటుంది. కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ఉద్యోగుల ఇష్టారాజ్యానికి చెక్

రోజూ ఉద్యోగులు ఉదయం 10:30 గంటలకు కచ్చితంగా కార్యాలయాలకు చేరుకుని అనంతరం బయోమెట్రిక్ విధానంలో వేలిముద్ర ద్వారా హాజరువేసుకోవాలి. తిరిగి సాయంత్రం విధులు ముగిశాక మళ్లీ నమోదు చేసుకోవాలి. నెలలో మూడుసార్లకు మించి ఆలస్యంగా వస్తే ఆ ఉద్యోగికి ఒకరోజు వేతనం కోత విధిస్తారు లేదా దానిని క్యాజువల్ లీవ్‌గా పరిగణిస్తారు. తరచూ ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. దీనికి తోడు ఉద్యోగులు, సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు నిఘా పెరగనుంది. నిత్యం ఉద్యోగుల అటెండెన్స్ కలెక్టరేట్ సముదాయంలోని సర్వర్‌కు అనుసంధానించడంతో ఎప్పటికప్పుడు కలెక్టర్ సైతం పర్యవేక్షిస్తారు.

పక్కాగా అమలు చేస్తున్నాం



కలెక్టర్ ఆదేశాలతో డీఆర్డీఏలో పనిచేస్తున్న ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. నిత్యం విధులకు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది హాజరును పర్యవేక్షణ చేస్తున్నాం. దీనివల్ల ఉద్యోగులు సమయపాలన పాటించడమే కాకుండా పాలనా పరంగా పారదర్శకత పెరిగే అవకాశం ఉంటుంది. విధులకు ఆలస్యంగా వచ్చే సిబ్బందిపై చర్యలు చేపడతాం.

–జి.మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

పకడ్బందీగా 'పది' పరీక్షలు..

- రేపటి నుంచి వార్షిక పరీక్షలు
- హాజరుకానున్న 12,492 మంది విద్యార్థులు



జూలూరుపాడు కేజీబీవీ విద్యార్థినులు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. 3 నుంచి 13వ తేదీ పరీక్షలు కొనసాగనుండగా, 12,492 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 6,075 మంది, బాలికలు 6,417 మంది ఉండగా, 471 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. 70 రెగ్యులర్ పరీక్ష కేంద్రాలు, 2 ప్రైవేటు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొత్తగూడెం సూర్యోదయ స్కూల్, భద్రాచలం గర్ల్స్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో ప్రైవేటు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్, 72 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 72 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, 72 మంది సిట్టింగ్ స్క్వాడ్‌ను, 11 మంది సెంటర్ కస్టోడియన్ అధికారులను నియమించారు. ఉదయం 9.30 నిమిషాల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, పెన్నులు, పెన్సిల్స్ వంటి రాత సామగ్రి మాత్రమే తెచ్చుకోవాలని విద్యాశాఖాధికారులు వివరించారు. కేంద్రంలో పరీక్ష పత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఓపెన్ చేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిరాక్స్ సెంటర్లను మూసివేయించనున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తితే ఏసీజీఈ ఎస్.మాధవరావు, 89192 79238, జిల్లా కంట్రోల్ 93966 54181లలో సంప్రదించాలి.

ప్రశాంత వాతావరణంలో..



జిల్లాలో పదో తగరతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ఎండాకాలం కావడంతో మంచినీరు, గదులలో ఫ్యాన్లు ఏర్పాట్లు చేశాం. గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే కంగారు పడకుండా పరీక్షలను ప్రశాంతంగా రాసే వీలుంటుంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాధికారి

వైభవంగా రథోత్సవం

నేడు రామయ్యకు తెప్పోత్సవం, దొంగల దోపు ఉత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న ఈఓ రమాదేవి, అర్చకులు, ఉద్యోగులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారు శనివారం రథోత్సవంలో విహరించారు. స్వామివారికి పట్టాభిషేకం జరిగిన రోజునే రథోత్సవం జరపటం భద్రాచల దివ్యక్షేత్రంలో ఆనవాయితీ. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసిన నేపథ్యంలో శనివారం రథోత్సవం జరిపారు. స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, రథంపై ఉంచి ఆలయం నుంచి తాతగుడి వరకు ఊరేగింపు నిర్వహించారు. దారి పొడువునా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తరించారు. రథోత్సవంలో శ్రీ రాముని సేవించిన వారికి ముక్తి లభిస్తుందని స్థల పురాణం చెబుతుందంటూ అర్చకులు వివరించారు.

రామయ్యకు పండితుల మహదాశీర్వచనం

వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పండితులు రామయ్య స్వామికి మహదాశీర్వచనం అందచేశారు. కల్యాణం జరిగిన మూడో రోజున స్వామి వారికి మహదాశీర్వచనం అందజేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని వేద పండితులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని బేడా మండపంలో కొలువుదీర్చి పూలు, పండ్లను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆదివారం తెప్పోత్సవం, దొంగల దోపు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ ఎల్.రమాదేవి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, సీసీ అనిల్ పాల్గొన్నారు.



మహదాశీర్వచనం అందచేస్తున్న అర్చకులు, పండితులు


నేటి నుంచి భగీరథ తాగునీరు..

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో మిషన్‌భగీరథ ఇంటెక్‌వెల్‌లో సిల్ట్ తీసే పనులు శనివారంతో పూర్తయ్యాయి. దీంతో నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేయనున్నారు. ఇంటెక్ వెల్ పంపుల్లో సిల్ట్, ఇసుక పేరుకుపోవడంతో 15 రోజులుగా తొలగింపు పనులు చేపట్టారు. దీంతో తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలిగింది. ఆదివారం నుంచి రోజూ మిషన్‌భగీరథ నీళ్లు వస్తాయని అధికారులు తెలిపారు.

అటు ఆట.. ఇటు బెట్టింగ్ పాట!

ఐపీఎల్‌తో పాటే మొదలైన పందేలు

- కాయ్ రాజా కాయ్ అంటూ పోటాపోటీ
- రూ.వేలు దాటి రూ.లక్షలకు చేరుతున్న వైనం
- గతంలో జిల్లాలో పట్టుబడిన పలువురు



పాల్వంచ రూరల్: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) టీ 20 క్రికెట్ 16వ సీజన్ మొదలైంది. రెండు నెలలపాటు జరగనున్న 74 మ్యాచ్‌ల్లో మొదటి మ్యాచ్ శుక్రవారం జరిగింది. క్రికెట్ అభిమానులు తాము మెచ్చే జట్ల నడుమ మ్యాచ్‌లను ఆసక్తిగా చూస్తూ గెలవాలని కోరుకుంటుండగా.. మరోపక్క బెట్టింగ్ రాయుళ్లు సైతం రంగంలోకి దిగారు. గతంలో తమ వద్ద పందేం కాసిన వారే కాకుండా కొత్త వారినీ ఆకట్టుకుంటూ రూ.వేలు దాటి రూ.లక్షల్లో బెట్టింగ్‌కు పాల్పడుతుండగా అమాయకులు వారి ఉచ్చులో చిక్కుకుని మోసపోయే ప్రమాదముంది.

అప్పులు చేసి మరీ...

పాల్వంచలో ఓ యువకుడు పెళ్లికి వచ్చిన వరకట్నం డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడు. దీంతో భార్యాభర్తలు విడిపోయే పరిస్థితి ఎదురైంది. విద్యార్థులు సెల్‌ఫోన్‌ల ద్వారా రూ.వేలల్లో లోన్లు తీసుకుని బెట్టింగ్‌లకు పాల్పడ్డి అప్పుల పాలై ఇళ్లు వదిలి వెళ్లిన ఉదంతాలు ఉన్నాయి. ఇలా ప్రతీ ఐపీఎల్ సీజన్‌లో అనేక మంది రోజంతా కష్టపడి సంపాదించిన మొత్తాన్ని క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయిన వారు ఉన్నారు. గతంలో పోలీసులకు పట్టుబడిన వారే మళ్లీ ఈసారి సైతం అదే బాట ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం అంత సెల్‌ఫోన్ల ద్వారానే కొనసాగుతుంది. బెట్టింగ్ కాసిన మొత్తానికి రెండింతల డబ్బు మరునాడు అకౌంట్‌లో జమ చేస్తారు. అయితే, ఒకరిద్దరి మాత్రమే డబ్బు ఇస్తుండగా ఎక్కువ మంది డబ్బు కోల్పోతారని తెలుస్తోంది.

బాల్ టూ బాల్ బెట్టింగ్‌లు

ఐపీఎల్ సీజన్‌లో ఏ రోజుకా రోజు మ్యాచ్ ప్రారంభం కాగానే బెట్టింగ్ మొదలుపెడతారు. మ్యాచ్ విజయావకాశాలే కాకుండా ఏ ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి, ఏ బాల్ సిక్స్ కొడతారు... ఇలా ఏ అంశాన్ని కూడా వదలకుండా పందెం కాస్తూ యువకులు ఉచ్చులో చిక్కుకునేలా చూస్తారు. ఈక్రమంలో పలువురు అత్యాశకు పోయి రూ.లక్షల్లో డబ్బు నష్టపోతుంటారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు వంటి ప్రాంతాల్లో బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగుతుందనే ప్రచారం సాగుతోంది. గతంలో పాల్వంచ మండలం నాగారంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇల్లెందు ఏరియాలో ఎనిమిది మందిపై, రుద్రంపూర్ ఏరియాలో ఐదుగురిపై, రామవరంలో ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి బెట్టింగ్ ఉచ్చులో ఎవరూ నష్టపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

బెట్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు



ఐపీఎల్ టీ–20 క్రికెట్ పోటీలు మొదలైన నేపథ్యాన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. క్రికెట్‌ను ఎవరైనా సరే క్రీడాస్ఫూర్తితో వీక్షించాలి. అంతే తప్ప బెట్టింగ్‌లు నిర్వహించినా, పాల్గొన్నా నేరమవుతుంది. ఎక్కడా బెట్టింగ్ జరగకుండా పర్యవేక్షిస్తున్నాం. ఎవరైనా పట్టుబడితే వదిలే ప్రసక్తే లేదు.

– వెంకటేష్, పాల్వంచ డీఎస్పీ

క్లుప్తంగా

ఇంటిపై కూలిన చెట్టు



ఇంటిపై విరిగిపడిన చెట్టు

పాల్వంచరూరల్: గాలి వాన కారణంగా ఓ ఇంటిపై భారీ చెట్టు విరిగి పడింది. ఇంట్లో ఉన్న సామగ్రి దెబ్బతిని లక్షకుపైగా నష్టం వాటిల్లింది. మండలంలోని సంగం గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన గాలివానకు ఏర్పుల జోసెఫ్ ఇంటి పక్కన ఉన్న చెట్టు విరిగి ఇంటిపై పడింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధ దంపతులు జోసెఫ్, ఈశ్వరమ్మ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. చెట్టు విరిగి పడటం వల్ల ఇంట్లో సామగ్రి అంతా దెబ్బతిని నష్టం జరిగిందని, తమను ఆదుకోవాలని వారు కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రంగా ప్రసాద్ ఘటనా స్థలానికి ఆర్ఐ హచ్యాను పంపించి నష్టాన్ని అంచనా వేయించారు.

వేగంగా విజిలెన్స్ విచారణ

ఇల్లెందు: కేబుల్ చోరీ ఘటనలో నిజాలను నిగ్గు తేల్చే పనిలో విజిలెన్స్ అధికారులు నిమగ్నమయ్యారు. నూటికి నూరు శాతం చోరీ ఘటన సంస్థ ఉద్యోగుల హస్తంతోటే జరిగిందని భావిస్తున్నారు. 21 ఇంక్లయిన్ మైన్ మూత పడటంతో అక్కడి వస్తువులన్నీ స్టోర్‌కు తరలించారు. గత జనవరిలో అక్కడ వాడిన కేబుల్‌ను కూడా స్టోర్‌కు తరలించి ఓ షెడ్డులో భద్రపర్చారు. మార్చి 18వ తేదీన ఆ స్టోర్‌లో కేబుల్ మాయం అయినట్లు అధికారులకు సమాచారం అందింది. దాదాపు రూ.10 లక్షల విలువ చేసే సుమారు 9 టన్నుల కేబుల్ అక్కడి నుంచి మాయం అయినట్లు గుర్తించారు. అప్పటికే విజిలెన్స్‌కు ఫిర్యాదు అందటంతో ఆ విభాగం అధికారులు రంగంలోకి దిగి విచారణ ముమ్మరం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. కాగా, ఓ అధికారి ఆజ్ఞతో కొందరు ప్రైవేట్ వర్కర్లు కేబుల్‌ను కంపెనీ వాహనంలో లోడ్ చేసి తరలించినట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా శనివారం ఏరియా జీఎం షాలేమురాజుతో కేబుల్ చోరీ అంశం ప్రస్తావించగా నిజం నిగ్గు తేలుతుందని, దోషులు దొరికే అవకాశం ఉందని, ఎంతటి వారైనా చర్యలు ఉంటాయని తెలిపారు.

బస్సును దహనం చేసిన మావోయిస్టులు



మావోయిస్టులు దహనం చేసిన ప్రైవేట్ బస్సు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు ఓ ప్రైవేట్ బస్సును దహనం చేశారు. నారాయణ్‌పూర్ నుంచి దంతెవాడకు సుమారు 30 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రిబస్సు వెళ్తోంది. ఈ క్రమంలో దంతెవాడ జిల్లా మాలేవాహి – బొడ్లీ మధ్య బస్సును ఆపిన మావోయిస్టులు ప్రయాణికులు, సిబ్బందిని కిందకు దించాక డీజిల్ ట్యాంక్ బద్ధలు కొట్టి నిప్పంటించారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. అనంతరం ప్రయాణికులు, సిబ్బంది సమీపంలోని బొడ్లీకి చేరుకోగా శనివారం ఉదయం పోలీసులు ప్రత్యేక వాహనాల్లో గమ్యస్థానాలకు పంపించారు. ఈ ఘటనలో సుమారు 25 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లుగా ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది.

ఇద్దరు వివాహితలు అదృశ్యంపై కేసు

పాల్వంచరూరల్: ఇద్దరు వివాహితలు అదృశ్యమైన ఘటన శనివారం వెలుగులోకి రాగా, పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కిన్నెరసాని గ్రామంలో నూడుల్స్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ధరావత్ నాగేశ్వరరావు.. భార్య రమాదేవి గత నెల 25వ తేదీన ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలు తీసుకుని.. తనకా పెట్టి డబ్బులు తీసుకొస్తానని చెప్పి వెళ్లింది. తిరిగి ఇంతవరకు రాకపోగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో నాగేశ్వరరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మండలంలోని ఉల్వనూరుల క్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన గంటికోట మధార్ భార్య అలివేలు గత నెల 30వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

జూదరులు అరెస్ట్

పాల్వంచరూరల్: పొలంలో రహస్యంగా పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని పాత పునుకుల గ్రామ శివారులోని పొలంలో శనివారం కోళ్లను తీసుకువెళ్లేందుకు వాహనాల డ్రైవర్లు అక్కడికి వచ్చారు. అనంతరం అందరూ కలిసి పేకాట షురూ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,010 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఓ సమయం అంటూ లేదా?

- చౌకదుకాణాల్లో సమయపాలన లేదు..
- దుకాణాల ఎదుట బోర్డులు కూడా ఏర్పాటు చేయని దుస్థితి
- పంపిణీ తేదీ, సమయం తెలపాలని లబ్ధిదారుల డిమాండ్



రామాంజనేయకాలనీలో బోర్డు లేని రేషన్ దుకాణం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని చౌక దుకాణాల్లో బియ్యం ఎప్పుడు సరఫరా చేస్తారో తెలియని దుస్థితి నెలకొంది. ఒక నెల ఒక తేదీన ఇస్తే మరో నెల మరోతేదీన బియ్యం ఇవ్వడం పరిపాటిగా మారింది. దీంతో ప్రతినెలా రేషన్ దుకాణానికి ఏ తేదీలో.. ఏ సమయంలో వెళ్లాలో తెలియక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ బియ్యం పథకం చాలా కుటుంబాలు గడవడానికి ఆధారం. రేషన్ బియ్యం అవసరం లేనివారు కూడా ఉన్నప్పటికీ ఎక్కువ శాతం పేదలు రేషన్ బియ్యంతో కడుపు నింపుకుంటున్నారు. అయితే, చౌక దుకాణాల ద్వారా బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతినెలా చౌక దుకాణాలను ఎప్పుడు తీస్తారో? ఎప్పుడు బియ్యం పంపిణీ చేస్తారో? తెలియని అయోమయం నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇష్టారాజ్యంగా పంపిణీ జరుగుతోంది. ఉన్నతాధికారులు అప్పుడప్పుడూ.. ప్రత్యేక పరిస్థితులలో ఈ నెల ఈ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తారని ప్రకటనలు ఇస్తారు. సంవత్సరంలో ఇలా ప్రకటనలు ఒకటి రెండు సార్లు వెలువడుతాయి. మిగతా నెలల్లో పట్టించుకునే నాథుడే ఉండడనేది బహిరంగ రహస్యం. చౌక దుకాణాల ఎదుట కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం విశేషం. ప్రతి చౌక దుకాణం ఎదుట సమయం.. స్టాక్ వివరాలు పెట్టాలని ఉన్నతాధికారులు ఎప్పుడో ఒకసారి ప్రకటనల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తారు. కానీ, ఆచరణలో మాత్రం చర్యలు శూన్యం. ఇలాంటి హెచ్చరికలకు అలవాటుపడిన చౌకదుకాణాల యజమానులు కొంతమంది ఇష్టారాజ్యంగా పంపిణీ చేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల నిర్ణీత సమయంలో పంపిణీ చేసేవారికి సైతం చెడ్డ పేరు వస్తోంది. నెలకు ఎన్ని రోజులు పంపిణీ చేస్తారు..? ఏ తేదీ నుంచి ఏ తేదీ వరకు బియ్యం ఇస్తారు? ఏ సమయం నుంచి మొదలు పెట్టి ఏ సమయం వరకు ఇస్తారు? అసలు రేషన్‌షాపు పరిధిలో ఎంతమంది లబ్ధిదారులున్నారు? ఆయా నెలల్లో ఒక్కొక్కరికీ ఎంత బియ్యం ఇస్తారు? స్టాకు ఎంత?.. అనే విషయాలను ఎవరూ తమ దుకాణాల ఎదుట ప్రదర్శించరు. ప్రతినెలా ఎప్పుడు బియ్యం ఇస్తారోనని గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో రోజు కూలీ చేసే లబ్ధిదారులు కూలి పని మానుకుని ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. కూలీ నష్టపోయి, పనుల వద్ద యజమానులతో ఇబ్బందులు పడి, చివరికి సకాలంలో రేషన్‌బియ్యం అందక పేదలు పడే మనోవేదన అంతా ఇంతా కాదు. మార్చిలో అయితే 19వ తేదీనే బియ్యం పంపిణీకి చివరి తేదీ అని, సమయాన్ని పొడిగిస్తే సమాచారం ఇస్తామని రేషన్ డీలర్లు లబ్ధిదారులకు చెప్పడం విశేషం. అసలు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియక ఇబ్బంది పడుతుంటే సమయం అయిపోయిందనే సమాధానాలు చాలాచోట్ల వినిపిస్తున్నాయి. ఇక ఏప్రిల్‌లో ఎప్పుడు పంపిణీ ప్రారంభిస్తారో వేచి చూడాల్సి ఉంది. జిల్లాలో ఉన్న కుటుంబాలు 2,79,190 కాగా పాత ఆహార భద్రత కార్డులు 2,63,492 ఉన్నాయి. కొత్త ఆహార భద్రత కార్డులు 12,500 ఉన్నాయి. అంత్యోదయ కార్డులు 18,821 ఉండగా అన్నపూర్ణ కార్డులు నాలుగు ఉన్నాయి. మొత్తం కలిపి 2,94,817 కార్డులు ఉన్నాయి. ఒక్కో నెల లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 5 కేజీలు, ఒక్కోసారి 6 కేజీలు, 10 కేజీలు కూడా ఇస్తారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా పంపిణీ జరగడం వల్ల నిజంగా రేషన్ బియ్యం అవసరం ఉన్న వారు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రతి రేషన్ దుకాణం ఎదుట బోర్డులను ఏర్పాటు చేయించడంతోపాటు పంపిణీ సమయాలను పొందుపర్చాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

సమయం తెలియడం లేదు..



రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేసే సమయం తెలియక నష్టం జరుగుతోంది. ప్రతి నెల పలు తేదీల్లో బియ్యం సరఫరా చేస్తుండటంతో అయోమయం నెలకొంది. ముందుగానే ఏయే తేదీల్లో బియ్యం పంపిణీ జరుగుతుందో తెలపాలి. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎండీ నూర్‌మహ్మద్, కొత్తగూడెం

బోర్డులు పెట్టకపోతే చర్యలు



రేషన్ దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులు పెట్టకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు 8 కేసులు నమోదు చేశాం. ప్రతి రేషన్ షాపు ముందు పేరు, వివరాలు ఉండాలి. అలా చేయని వారి సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ ఉంటుంది.

– మల్లికార్జున్‌బాబు, డీఎస్‌ఓ

సమగ్ర నివేదికలు ఇవ్వాలి

- పంట నష్టాన్ని పక్కాగా అంచనా వేయాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షాలు, గాలి దుమారాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలపై సమగ్ర నివేదికలు అందజేయాలని కలెక్టర్ అనుదీప్ వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి శనివారం పంటనష్టాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 16 నుంచి 21వ తేదీ వరకు వచ్చిన అకాల వర్షాలు, గాలి దుమారాల వల్ల పంటనష్టం జరిగిందని, రైతులకు పరిహారం అందించేందుకు నష్టం అంచనా వేయాలని సూచించారు. ప్రతి క్లస్టర్‌లో క్రాప్ బుకింగ్ ప్రకారం గణన ప్రక్రియ పక్కాగా చేపట్టాలని అన్నారు. కౌలు రైతులకు కూడా పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల్లో గణన ప్రక్రియ పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ, మండల వ్యవసాయాధికారులతో పాటు సహాయ సంచాలకులు ఇచ్చిన నివేదికను వ్యవసాయ, ఉద్యాన అధికారులు ధ్రువీకరించాలని ఆదేశించారు. పరిహారం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నందున నష్టపోయిన రైతుల భూముల సర్వేనంబరు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ, ఆధార్ నంబరు, కుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. జిల్లాలో 2,600 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారని, క్షేత్రస్థాయిలో విచారించి జాబితాను తయారు చేయాలని చెప్పారు. బోగస్ నివేదికలు ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణన ప్రక్రియకు ప్రత్యేకంగా విజిలెన్స్ టీంలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం మండలాల్లో సర్వే ప్రక్రియ నిర్వహణ, పంటనష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, ఏడీలు, మండల వ్యసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

అనుబోస్ విద్యార్థుల ఇస్రో సందర్శన



ఇస్రో సందర్శనలో అనుబోస్ కాలేజీ విద్యార్థులు

పాల్వంచ: స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సాంకేతిక విజ్ఞాన అవగాహనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ ఇస్రో కేంద్రంలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌ను సందర్శించినట్లు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఎస్‌సీలో భాగమైన జీయో స్పేషియల్ డేటా, అంతరిక్ష ప్రయోగిక శాటిలైట్లు, వాణిజ్య ఉపగ్రహాలు, వాటి అనువర్తనాలు, మ్యాపింగ్, అభివృద్ధి వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారని చెప్పారు. కాగా, విద్యార్థులను కళాశాల చైర్మన్ భరత్ కృష్ణ అభినందించారు.

రూ.40 వేలు కాజేసిన దుండగుడు

పోలీస్‌నంటూ మోసం చేసిన వైనం

అశ్వారావుపేటరూరల్: తాను పోలీస్‌నంటూ.. ఓ మీసేవ నిర్వాహకుడిని బురిడి కొట్టించి నగదు కాజేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్‌లోగల మీ సేవ నిర్వాహకుడికి గత నెల 29వ తేదీన తాను స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నానని, తన పేరు అశోక్ అంటూ.. ఓ వ్యక్తి ఫోన్ చేసి అర్జెంట్‌గా రూ.40 వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించాలంటూ కోరాడు. వాట్సాప్ నంబరుకు క్యూఆర్ కోడ్ పంపిస్తానని, దానికి నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తే కానిస్టేబుల్‌తో డబ్బులు పంపిస్తానని చెప్పడంతో కేటుగాడి మాటలు నమ్మి నగదు బదిలీ చేశాడు. కొద్ది సేపటి తర్వాత నగదు కోసం అదే నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్‌గా రావడంతో అనుమానం వచ్చి ఆరా తీస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆ పేరుతో సిబ్బంది లేరనే విషయం తెలిసి మోసపోయినట్లు గ్రహించాడు. దీనిపై అదే రోజు సైబర్ క్రైం ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



కుక్క దాడిలో గాయపడిన జితేందర్

జూలూరుపాడు: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడిపై వీధికుక్క దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. జూలూరుపాడుకు చెందిన బానోత్ వినోద్, పావని దంపతుల కుమారుడు జితేందర్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ప్రాంగణంలో ఆడుకుంటున్నాడు. సమీపంలోని ఇంట్లో పెంచుకుంటున్న కుక్క ఒక్కసారిగా జితేందర్‌పై దాడి చేయగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు చేరుకుని కుక్కను తరిమేశారు. అప్పటికే జితేందర్ కళ్లు, నుదురు, కుడి చేయి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి కొత్తగూడెం తీసుకెళ్లారు.

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన జీఎం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం రమేశ్

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ (మినరల్ వాటర్ ప్లాంట్)ను శనివారం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, కాపు కృష్ణ, రమేశ్, శామ్యూల్ సుధాకర్, సూర్యనారాయణ, సత్యనారాయణ, రమణారెడ్డి, రాజారాం, సుధాకర్, మల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని బిక్కుతండాకు చెందిన మాళోతు బంగారితో కరకవాగుకు చెందిన బి.రవికి వివాహం జరిగింది. పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో శనివారం రవి భార్య వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు హుటాహుటిన ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

కాలేజీకి వెళ్లాల్సినవారు ఆస్పత్రికి..

- రెప్పపాటులో మారిన దృశ్యం
- బైక్‌ను కారు ఢీకొట్టడంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలు..



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: ముగ్గురు విద్యార్థులు కలిసి బైక్‌పై కళాశాలకు వెళ్తున్నారు. కళాశాల ముఖద్వారం వచ్చింది.. బైక్‌ను మలిపి కాలేజీ లోపలికి వెళ్దామనుకునే లోపే కారు వచ్చి ఢీకొట్టింది. దీంతో వారు ముగ్గురు గాయాలతో ఆస్పత్రిలో చేరారు. రెప్పపాటులో కాలేజీకి వెళ్లాల్సిన విద్యార్థులు ఆస్పత్రిలో చేరారని వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. త్రీ ఇంక్లయిన్‌కు చెందిన లక్ష్మీనారాయణ, రామవరానికి చెందిన అక్షిత్, సుజాతనగర్ సింగభూపాలెం గ్రామానికి చెందిన ప్రభాస్.. రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మొదటి ఏడాది చదువుతున్నారు. వీరు (ఏపీ 20 ఏఎన్ 7712) బైక్‌పై కొత్తగూడెం నుంచి కళాశాలకు బయలుదేరారు. ఇదే సమయంలో రుద్రంపూర్ నుంచి చైతన్యప్రసాద్ అనే వ్యక్తి తన తల్లిని కారు (టీఎస్ 04 ఈజెడ్ 6261)లో ఎక్కించుకుని కొత్తగూడెం వస్తున్నాడు. బైక్ కళాశాల లోపలికి వెళ్లేందుకు తిప్పగా కారు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న చైతన్యప్రసాద్ తల్లి తలకు గాయమైంది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన విద్యార్థులను కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన మహిళను సింగరేణి ప్రధానాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ ఎస్‌ఐ జుబేదా తెలిపారు.

తలదాచుకునేందుకు వెళ్లి హతమై..

- చర్ల మండలంలో గిరిజనుడి దారుణహత్య
- వర్షం వస్తుండడంతో.. ఓ ఇంట్లోకి వెళ్లగా ఘటన



కన్నారావు మృతదేహం వద్ద తాళ్లతో కట్టేసిన కృష్ణ, కాంతమ్మ

చర్ల: వర్షం వస్తుండడంతో నీడ కోసం ఓ ఇంట్లోకి వెళ్లిన గిరిజనుడు దారుణ హత్యకు గురయ్యాడు. తలదాచుకునే చోటు ఇచ్చే విషయంలో ఘర్షణ జరిగిందా..? ఇతర కారణాలు ఉన్నాయా? అనేది తెలియరాలేదు. చర్ల మండలం పెదమిడిసిలేరుకు చెందిన బెండబోయిన కన్నారావు (43) శనివారం ఉదయం కట్టెల కోసం అడవికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గీసరెల్లి సమీపానికి రాగానే వర్షం మొదలవడంతో ఆ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న మునిగల కృష్ణ ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయాన ఇంట్లో ఒంటరిగా ఉన్న కృష్ణ.. కన్నారావుతో గొడవ పడి ఆయన చేతిలోని గొడ్డలి తీసుకుని నరికి చంపాడు. తరువాత మృతదేహాన్ని ఇంట్లో నుంచి తీసుకొచ్చి ఊరి బయట వేయడంతో విషయం బయటకు వచ్చింది. కాగా, హత్యకు పాల్పడిన కృష్ణ సైకోలా వ్యవహరిస్తుంటాడని, గతంలో ఇళ్లకు నిప్పంటించాడని, తరచుగా అందరితో గొడవ పడుతూ ఉంటాడని గీసరెల్లి గ్రామస్తుల ద్వారా తెలిసింది. కన్నారావు మృతదేహాన్ని కృష్ణ తీసుకొచ్చే క్రమంలో గుర్తించిన గ్రామస్తులు ఆయనను తాళ్లతో కట్టివేసి దేహశుద్ధి చేశారు. అలాగే, హత్యతో కృష్ణ తల్లి కాంతమ్మకు కూడా సంబంధం ఉందంటూ కన్నారావు కుటుంబీకులు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న చర్ల పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి గాయాలు

టేకులపల్లి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలవడంతోపాటు ఆరుగురిపై కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బద్దుతండాలో పాత కక్షల నేపథ్యంలో శనివారం భూక్య రఫీ, భూక్య కిషన్, భూక్య సుక్కి.. గుగులోత్ దూప్‌సింగ్ ఆయన భార్య వల్లితో గొడవకు దిగారు. ఈ క్రమంలో భూక్య రఫీ కోపోద్రిక్తుడై దూప్‌సింగ్ భార్య వల్లిని కర్రతో కొట్టడంతో ఆమెకు గాయమైంది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా, మండలంలోని గోలియాతండాలో గత నెల 29న ఓ స్థలం విషయంలో ఇదే గ్రామానికి చెందిన బోడ మాంజీ, బోడ లక్ష్మి, బోడ శ్యాంలాల్‌కు వాంకుగోత్ లక్ష్మికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురూ వాంకుడోత్ లక్ష్మి ఇంటి ముందుకు పోయి ఆమెను బూతులు తిడుతూ గడ్డపార, రాయితో దాడి చేశారు. ఈ ఘటనలో వాంకుడోత్ లక్ష్మి తలకు గాయమైంది. శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

బూర్గంపాడు: మణుగూరు క్రాస్‌రోడ్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు పట్టణానికి చెందిన సర్వేశ్వరరావు, సుహాసిని దంపతులు మోటార్ సైకిల్‌పై భద్రాచలం వస్తున్నారు. ఈ క్రమంలో మణుగూరు క్రాస్‌రోడ్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో సర్వేశ్వరరావు, సుహాసిని తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు

అశ్వారావుపేటరూరల్: ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక వికలాంగులకాలనీకి చెందిన కృష్ణ కారులో సత్తుపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ కళాశాల వద్ద గల ఉద్యాన నర్సరీ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విద్యుత్‌స్తంభం విరిగిపోగా, కారులో ఉన్న కృష్ణ సురక్షితంగా బయటపడ్డారు.

క్లుప్తంగా...

మామిడి రైతులకు ‘అకాల’ నష్టం



పెనుబల్లి మండలం కారాయిగూడెంలో మామిడి కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, అధికారులు

పెనుబల్లి/వేంసూరు: ఖమ్మం జిల్లా పెనుబల్లి, వేంసూరు తదితర మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుల వర్షానికి మామిడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. పలుచోట్ల తోటల్లో కోతకు వచ్చిన మామిడికాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు విజయనిర్మల, అనసూర్య పర్యటించి తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ గత నెలలో కురిసిన వర్షానికి రైతులు నష్టపోగా.. సీఎం కేసీఆర్ పరిశీలించి పరిహారం ప్రకటించారని తెలిపారు. మళ్లీ రైతులు నష్టపోయిన నేపథ్యంలో సమస్యను వ్యవసాయ శాఖ మంత్రితో పాటు సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం వేంసూరు మండలంలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు.

దివ్యదర్శనం టోకెన్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమల నడకమార్గాల్లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టీటీడీ శనివారం ఉదయం నుంచి పునః ప్రారంభించింది. కోవిడ్ నేపథ్యంలో మూడు సంవత్సరాలుగా టీటీడీ దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేసింది. అయితే భక్తుల కోరిక మేరకు అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం వద్ద 10 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో ఐదు వేల దివ్యదర్శనం టోకెన్లను శనివారం నుంచి కేటాయిస్తున్నారు. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టోకెన్లు జారీ చేస్తారు. కాగా, శ్రీవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 4న అష్టదళ పాదపద్మారాధన, 3 నుంచి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

వైద్య విద్య మరింత ఖరీదు?

- యూజీ, పీజీ మెడికల్, పారామెడికల్ కోర్సుల ఫీజు పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ కసరత్తు
- ఈ నెల 30లోగా కాలేజీల వారీగా ప్రతిపాదనలు కోరిన కమిటీ
- ఆదాయ, వ్యయాల ఆడిట్ రిపోర్టులు కూడా ఇవ్వాలని ఆదేశం
- వాటిని పరిశీలించాక ప్రభుత్వానికి నివేదిక
- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే అమల్లోకి కొత్త ఫీజులు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్య మరింత ఖరీదు కాబోతోంది. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు భారీగా ఉండగా, మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు అటు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తూనే.. ఇటు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ)కి సైతం విజ్ఞప్తులు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023–24 నుంచి 2025–26 మధ్య కాలానికి సంబంధించి ఫీజుల నిర్ధారణపై కసరత్తు మొదలుపెట్టిన టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 30వ తేదీలోగా మెడికల్ కాలేజీల వారీగా ప్రస్తుతం ఫీజులు, పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించింది.

కేటగిరీల వారీగా ఫీజులు

మెడికల్ కోర్సులకు సంబంధించి ఫీజులు ఒక్కో కేటగిరీలో ఒక్కో రకంగా ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో స్థిరమైన ఫీజులుండగా.. ప్రైవేటు కాలేజీల్లో మాత్రం ఏ, బీ, సీ కేటగిరీల్లో భిన్నమైన ఫీజులు తీసుకుంటున్నారు. ప్రైవేటు కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి కేటగిరీ ‘ఏ’ (కన్వీనర్ కోటా) అడ్మిషన్‌కు వార్షిక ఫీజు రూ.60వేలు ఉండగా.. కేటగిరీ ‘బీ’ (మేనేజ్‌మెంట్ కోటా)కి రూ.11.5 లక్షల నుంచి రూ.14.5 లక్షల వరకు ఉంది. ఇక కేటగిరీ ‘సీ’ (ఎన్నారై కోటా) అడ్మిషన్ ఫీజు రూ.25 లక్షల నుంచి రూ.28 లక్షల వరకు ఉంది. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కేటగిరీ ‘ఏ’కు రూ.7.5 లక్షలు, కేటగిరీ ‘బీ’కి రూ.28 లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఫీజు ఉంది. బీడీఎస్ కోర్సులకు కేటగిరీ ‘ఏ’లో రూ.45 వేలు, కేటగిరీ ‘బీ’లో రూ.4.2 లక్షలు ఉండగా.. కేటగిరీ ‘సీ’లో రూ.ఎనిమిదిన్నర లక్షల వరకు ఉంది. వీటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీల వారీగా భిన్నంగా ఉన్నాయి.

ఆడిట్ రిపోర్టులే కీలకం

యూజీ, పీజీ మెడికల్ కోర్సుల ఫీజు పెంపునకు కాలేజీల ఆడిట్ రిపోర్టులే కీలకం కానున్నాయి. టీఏఎఫ్‌ఆర్సీ తాజాగా ప్రతి కాలేజీ ఆడిట్ రిపోర్టును సమర్పించాలని సూచించింది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ, ఇతర వ్యయాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం ఉంటుంది. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒకరకంగా ఉంటే పట్టణ ప్రాంతాల కాలేజీల్లో మరోరకంగా ఉంటాయి. దీంతో కాలేజీ వారీగా ఆడిట్ నివేదికలను పరిశీలించాక ఫీజుల పెంపుపై టీఏఎఫ్‌ఆర్సీ ఒక అంచనాకు వస్తుంది. ఆ మేరకు ఫీజులను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం దానిని ఆమోదిస్తే కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి.

గద్వాలలో సరెండర్ లొల్లి!

- జెడ్పీ సీఈఓ విజయనాయక్ సరెండర్
- ప్రెస్‌మీట్ పెట్టి కలెక్టర్‌పై విమర్శలు
- ఫోన్ ద్వారా మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫిర్యాదు
- హాట్‌టాపిక్‌గా మారిన సరెండర్ వ్యవహారం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల జిల్లా పరిషత్ సీఈఓ విజయ నాయక్ సరెండర్..ఆ తర్వాత ఆమె కలెక్టర్ వల్లూరి క్రాంతిపై విమర్శలు గుప్పించడం హాట్‌టాపిక్‌గా మారింది. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి సీఈఓ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో అశ్రద్ధ వహిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా పరిపాలనకు ఆటంకం కలిగిస్తున్నారంటూ విజయ నాయక్‌ను పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ గద్వాల కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రెస్‌మీట్ నుంచే మంత్రికి ఫోన్..

తనను కలెక్టర్ వల్లూరు క్రాంతి సరెండర్ చేసి అన్యాయం చేశారంటూ ప్రెస్‌మీట్ నుంచే జెడ్పీ సీఈఓ..మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేశారు. తనను అన్యాయంగా సరెండర్ చేశారని..ఈ ఉత్తర్వులను ఆపి న్యాయం చేయాలని కోరారు. తాను జిల్లాలో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నానని.. విధులు ఎలా నిర్వర్తిస్తున్నానో తన టూర్ డైరీని పరిశీలించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి.. పూర్తి వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. అయితే ఆమె ఆదివారం ఉదయం 10 గంటలకు ఫోన్ చేస్తానని చెప్పగా.. ఆయన సరేనని సమాధానమిచ్చారు. కాగా.. జెడ్పీ సీఈఓ గతంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతోంది. అదనపు కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగడం, మహిళా దినోత్సవం రోజు ఓ మహిళా అధికారితో గొడవపడటం వంటి ఘటనలు ఉన్నాయని.. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో బాధితులను విజయ నాయక్ పట్టించుకోరనే ఫిర్యాదు కలెక్టర్‌కు చేరినట్లు తెలిసింది. దీంతో ఆమెపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

త్వరలో తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు

సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. ముందుగా తిరుపతి నుంచి కువైట్‌కు విమాన సర్వీసులు ప్రారంభించేలా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, విమానయాన సంస్థలతో ఎంపీ గురుమూర్తి, ఎయిర్‌పోర్టు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. తిరుపతి నుంచి కువైట్‌కు సర్వీసులు నడపడానికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నుంచి సంకేతాలు వచ్చాయని తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్‌కిషోర్ చెప్పారు.

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు హతం

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఘటన
- ఘటనాస్థలం వద్ద ఆయుధాలు, నగదు స్వాధీనం

చింతలమానెపల్లి/కాళేశ్వరం: మహారాష్ట్రలోని ఏటపల్లి, భామ్రాగఢ్ సమీపంలో ఉన్న గట్ట అటవీప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు సమీర్ అలియాస్ సాధులింగ మొహందా (31) మృతిచెందాడు. గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ ఈ ఘటన వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు గడ్చిరోలి జిల్లా భామ్రాగఢ్ సమీపంలోని తొడగట్ట ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సీ60 యాంటీ నక్సల్స్ పోలీసు బృందం కమాండోలు గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీసులను గమనించిన సుమారు 60 నుంచి 70 మంది మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. సుమారు 45 నిమిషాలపాటు కాల్పులు జరిపిన మావోయిస్టులు అనంతరం అటవీప్రాంతంలో తప్పించుకుని పారిపోయారు. కాల్పుల అనంతరం గాలింపు నిర్వహించగా సమీర్ మృతదేహం లభించింది. మృతుడు భామ్రాగఢ్ తాలూకా తుమర్కోడి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా, ఘటనా స్థలంలో ఒక 303 రైఫిల్, నాటుతుపాకీ, బర్మార్ రైఫిల్, రెండు ఎస్‌ఎల్‌ఆర్ మేగజీన్లు, 30 రౌండ్ల బుల్లెట్లు, 8ఎంఎం రైఫిల్, రూ.38వేల నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మావోయిస్టు యూనిఫారాలు, విప్లవ సాహిత్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టులకోసం గాలింపు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. మృతిచెందిన మావోయిస్టుపై రూ. 2 లక్షల రివార్డు ఉంది. మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో గడ్చిరోలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.



ఎన్‌కౌంటర్ స్థలంలో లభించిన తుపాకులు, సామగ్రి

ప్రభుత్వ స్థలంలో గుడిసెల దహనం

పోలీసు బందోబస్తు మధ్య తగులబెట్టిన రెవెన్యూ సిబ్బంది



గుడిసెలను కూల్చి కాల్చివేస్తున్న దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ స్థలంలో ఇళ్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య శనివారం తగులబెట్టారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామంలో ఇళ్లు లేని ఎస్సీ, బీసీ నిరుపేదలకు 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 180 మందికి, 2010లో కాంగ్రెస్ ప్రభుత్వం 40 మందికి మొత్తం 220 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. సర్వే నంబర్ 175తో పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలను చూపించక పోవడంతో ఏళ్ల తరబడి పేదలు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఆ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో రైతు వేదిక, విద్యుత్ ఉప కేంద్రం కార్యాలయాన్ని నిర్మించారు. మిగతా ప్రభుత్వ స్థలంలో నాలుగు నెలల క్రితం బాధితులు గుడిసెలు వేసుకున్నారు. తమకు న్యాయం చేయాలని, గతంలో ప్రభుత్వం అందజేసిన ఇళ్ల పట్టాలతో బాధితులు తహసీల్దార్, ఆర్డీఓతో పాటు ఎమ్మెల్సీ కడియం, ఎమ్మెల్యే రాజయ్యకు వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ ఎవరూ స్పందించకపోగా నాలుగు నెలల్లో రెవెన్యూ సిబ్బంది పలుమార్లు గుడిసెలు తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎన్నిమార్లు హెచ్చరించినా బాధితులు వినకపోవడంతో శనివారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తుతో వచ్చి పేదలు వేసిన గుడిసెలను జేసీబీతో తొలగించి తగులబెట్టారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకునే సరికి గుడిసెలు మొత్తం కాలిబూడిదయ్యాయి. ఈ ప్రభుత్వ స్థలాన్ని ఫైర్ స్టేషన్ కోసం, పలు ప్రభుత్వ అవసరాల కోసం ఈ కేటాయించామని తహసీల్దార్ ఫూల్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

జిల్లా వార్తలు


కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన షేక్ నాజీమా తండ్రి లాలా మహమ్మద్ కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా నండ్రు ప్రమోద్ ఆధ్వర్యాన సేకరించిన రూ.35,200 నగదును శనివారం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు ఎస్.కే.చాంద్‌పాషా, నడ్డి జమలమ్మ, తడికమళ్ల ప్రకాశరావు, నడ్డి ఆనందరావు, అద్దంకి అనిల్, రఘు, జిన్నీ, పూజల రవి, మదీనాపాషా, జాని, సాయిపూజిత, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థుల్లో మనోధైర్యం నింపండి




వీసీలో పాల్గొన్న పీఓ గౌతమ్, అధికారులు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఆశ్రమ, గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపి వార్షిక పరీక్షలు ధైర్యంగా రాసేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఆమె ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, గురుకులాల కార్యదర్శి సెక్రెటరీ రోనాల్డ్ రోస్, ఏడీ సర్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఐటీడీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలని, వారి వెంట ఓ ఉపాధ్యాయుడిని పంపాలని సూచించారు.అలాగే, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. భద్రాచలం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ రమాదేవి, ఏసీఎంఓ రమణయ్య తదితరులు హాజరయ్యారు.

కళ్లారా చూడొచ్చు.. ఎదగొచ్చు!

- ఇస్రోలో శిక్షణకు విద్యార్థులకు అవకాశం
- 9వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- స్వీకరణకు రేపటితో ముగియనున్న గడువు



ఉపగ్రహ నమూనాను పరిశీలిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే కాక శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించి భావి శాస్త్రవేత్తలు ఎదిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందులో భాగంగానే వేసవి సెలవుల్లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాయి. అన్ని రాష్ట్రాల నుంచి ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి యువ విజ్ఞాని కార్యక్రమం(యువిక) పేరుతో శిక్షణ ఇస్తారు. దరఖాస్తు గడువు సోమవారంతో ముగియనుండగా.. ప్రతిభావంతులను శిక్షణకు ఎంపిక చేస్తారు.

ప్రతిభే ఆధారం

ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇస్రోలో శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అయితే, 8వ తరగతిలో మంచి మార్కులు సాధించడమే కాక గడిచిన మూడేళ్లలో ఒలింపియాడ్, సైన్స్ పోటీల్లో పాల్గొని ఏదైనా బహుమతి సాధించడం, 1నుంచి 3లోపు ర్యాంక్‌లు సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అలాగే, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్లు, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రాధాన్యమిస్తారు. కాగా, జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 453 ఉండగా, ఇందులో 9వ తరగతి 18,490మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 9,697 మంది బాలురు, 8,793మంది బాలికలు ఉండగా.. ఇస్రో శిక్షణకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

దరఖాస్తు ఇలా...

ఇస్రోలో శిక్షణ కోసం విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తొలుత ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు పంపించాలి. ఆ తర్వాత 48గంటల్లోగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలో పాల్గొనాలి. క్విజ్ పూర్తయిన 60 నిమిషాల్లోగా యువిక పోర్టల్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. మొత్తం సమాచారంతో కూడిన దరఖాస్తు, సంతకం చేసిన ప్రతి, అవసరమైన ధృవపత్రాలతో అప్‌లోడ్ చేయాలి. సోమవారం లోగా ఇవన్నీ పూర్తిచేస్తే... ఎంపికైన వారి జాబితాను 10వ తేదీన ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం ఇస్తారు. శిక్షణకు వెళ్లే వారికి రవాణా ఖర్చులు సైతం ప్రభుత్వమే భరిస్తుంది.

శిక్షణ ఇక్కడే...

ఇస్రో అర్హత పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్‌తో పాటు శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్, తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్.రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎస్‌ఏసీ), హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సీ), షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎన్‌ఈ–ఎస్‌ఏసీ) శిక్షణ ఉంటుంది. మే 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చి, ఆతర్వాత శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరిశోధనలపై అవగాహన కల్పిస్తారు. తద్వారా విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొంది శాస్త్రవేత్తలుగా ఎదుగుతారనేది ప్రభుత్వ భావనగా చెబుతున్నారు.

రేపటి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు...



విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రో యువిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దరఖాస్తు చేసుకున్న వారిలో ప్రతిభావంతులను గుర్తించి శిక్షణకు ఎంపిక చేస్తారు. సోమవారం వరకు దరఖాస్తుకు అవకాశం ఉండగా, 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సైదులు, జిల్లా సైన్స్ అధికారి

‘ధ్వజస్తంభం’ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ

ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి వరంగల్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ



ఆలయం వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: ఆలయం వద్ద ప్రతిష్ఠించాల్సిన ధ్వజస్తంభం దుంగను అటవీ శాఖ అధికారులు నరికివేయగా.. గ్రామస్తులు అటవీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో పాటు దాడి చేసిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించగా వరంగల్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ నాగభూషణం శనివారం విచారణ ప్రారంభించారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపాన పెదవాగు ప్రాజెక్ట్ కట్ట దిగువన నిర్మిస్తున్న శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో ధ్వజస్తంభం కోసం గ్రామస్తులు సమీప అటవీ ప్రాంతం నుంచి నార వేప దుంగను తీసుకురాగా, స్థానిక అటవీ సిబ్బంది దాన్ని రంపంతో ముక్కలు కోయించి తీసుకెళ్లారు. దీంతో గ్రామస్తులు, హిందూ సంఘాల నాయకులు శుక్రవారం రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించడంతోపాటు దాడి చేశారు. ఈ ఘటన రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశం కాగా, రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. దీంతో వరంగల్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ ఆధ్వర్యాన డీఆర్‌ఓ, ఎఫ్‌ఆర్‌ఓతో కూడిన బృందం శనివారం గంగానమ్మ ఆలయాన్ని సందర్శించి ఘటనపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ధ్వజస్తంభం కోసం తీసుకొచ్చిన దుంగను ముక్కలుగా చేయడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం విచారణ బృందం అశ్వారావుపేటలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి వెళ్లి తాజాగా జరిగిన దాడి వివరాలు తెలుసుకున్నారు.

బొగ్గు ఉత్పత్తిలో సత్తుపల్లి టాప్

- రైల్వేలైన్‌తో రవాణా వేగవంతం
- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్



మాట్లాడుతున్న జీఎం రమేష్, పక్కన పీఓలు వెంకటాచారి, నర్సింహారావు

సత్తుపల్లి: సింగరేణి చరిత్రలోనే సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేశాయని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ వెల్లడించారు. సత్తుపల్లిలోని జీఎం కార్యాలయంలో జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావుతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలో తగ్గిన బొగ్గు ఉత్పత్తిని సత్తుపల్లి ఓసీలతో భర్తీ అవుతోందని చెప్పారు. జేవీఆర్ ఓసీ 100 లక్షల టన్నులు, కిష్టారం ఓసీ 20 లక్షల టన్నుల లక్ష్యాన్ని పూర్తిచేశాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది 154.55 లక్షల టన్నుల లక్ష్యం విధించినట్లు తెలిపారు. కాగా, బొగ్గు ఉత్పత్తి, రవాణాకు సహకరించిన ఉద్యోగులు, కార్మికులను సింగరేణి సీఎండీ, డైరెక్టర్లు అభినందించారని ఆయన చెప్పారు. కాగా, రూ.1200 కోట్లతో నిర్మించిన రైల్వే లైన్‌తో రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాక బొగ్గు రవాణాలో వేగం పెరిగిందని జీఎం రమేష్ తెలిపారు. గతంలో రోజుకు 600 ట్రిప్పులు బొగ్గును కొత్తగూడెంకు రవాణా చేయాల్సి వచ్చేదని, రైల్వేలైన్ ప్రారంభించాక ఒక్క ప్రమాదం కూడా నమోదు కాలేదని పేర్కొన్నారు.

దుమ్ము కంట్రోల్ చేస్తాం..

కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి వస్తున్న బొగ్గు దుమ్మును అరికట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు జీఎం రమేష్ తెలిపారు. నిత్యం నీటి సరఫరా కోసం ఇప్పటికే రెండు బోర్లు సీహెచ్‌పీ వద్ద వేయగా.. లక్ష గ్యాలెన్ల సంపును నిర్మిస్తున్నామని చెప్పారు. కాగా, కిష్టారంలో సేకరించిన 55 ఎకరాల భూమిలో సింగరేణి అధికారులకు 80 క్వార్టర్లతో పాటు జీఎం క్వార్టర్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. వచ్చేఏడాదికల్లా సత్తుపల్లిలో జీఎం కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభిస్తామని వివరించారు. ఇంకా సత్తుపల్లి–రేజర్ల రోడ్డుకు రూ.20 కోట్ల నిధులను ఆర్‌అండ్‌బీకి డిపాజిట్ చేశామని తెలిపారు.

ఇళ్ల మరమ్మతులు చేపడతాం

సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేపడుతున్నామని, ఇప్పటికి దరఖాస్తు చేసుకున్న 120 ఇళ్లను మరమ్మతులు చేశామని జీఎం రమేష్ చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇంకా బాధితులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈసమావేశంలో సింగరేణి అధికారులు సూర్యనారాయణ, శ్యామ్యూల్ సుధాకర్, యోహాన్, బంగారి శ్రీనివాస్, పి.నర్సింహారావు, రామకృష్ణ, రమణారెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, లక్ష్మణ్‌మూర్తి, రమణారావు, దేవదాసు, సందీప్ పాల్గొన్నారు.

‘బొమ్మ’ విద్యార్థులకు పేటెంట్



పేటెంట్ పత్రాలతో ప్రొఫెసర్, విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బొమ్మ ఫార్మసీ కాలేజీ ఫార్మకాగ్నిసీ అండ్ ఫైటోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌భాస్కర్‌రావు పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన ఫార్ములాకు పేటెంట్ లభించింది. బీ ఫార్మసీ మూడో సంవత్సరం విద్యార్థులు జస్వంత్‌కుమార్, మధు, మంజుల, శిల్ప, మానిక ఔషధ మొక్కలపై పరిశోధన చేసి నూతన ఫార్ములా కనుగొనగా, ప్రభుత్వం నుంచి పేటెంట్ లభించిందని విజయ్‌భాస్కర్‌రావు తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ఫార్ములాతో తయారుచేసే ఔషధం జుట్టు ఒత్తుగా పెరగడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్, విద్యార్థులను కాలేజీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సెక్రటరీ ఉదారు శ్రీధర్, డైరెక్టర్ మాధవి తదితరులు అభినందించారు.